యూరియా కోసం.. యాతన



ఆత్మకూరులో పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

- యూరియా కోసం రైతుల పాట్లు వర్ణనాతీతం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లోనే...
- జిల్లాకు సరిపడా రాని పరిస్థితి



ఎక్కడ చూసినా ప్రస్తుతం రైతన్న ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య యూరియా.. దీని కోసం అన్నదాతకు అగచాట్లు తప్పడం లేదు. పొద్దస్తమానం సంబంధిత కార్యాలయాల వద్ద పడిగాపులు కాసినా అరకొరగానే అందుతున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా మొత్తంగా 34,942 టన్నుల యూరియా అవసరం కాగా, ఇంకా 14,256 టన్నులు రావాల్సి ఉంది. పంటలు సాగు చేసిన రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

కందనూలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా కోసం ఆగచాట్లు పడుతున్నారు. సాగు చేసిన పంటలకు యూరియా అత్యవసరం. దీనికోసం జిల్లాలో ఉద్యమం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం జిల్లాకు అరకొర యూరియా సరఫరా చేయడంతో రైతులకు సరిపడక పోవడంతో ఫర్టిలైజర్ షాపుల దగ్గర క్యూలైన్‌లో నిలబడుతున్నారు. ఒక్కొక్క రైతు రెండు, మూడు బ్యాగుల చొప్పున తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతులు యూరియా కోసం పడిగాపులు కాసి పొద్దస్తమానం క్యూలైన్‌లో నిలబడితే రెండు బస్తాలతో సరిపెట్టి పంపిస్తున్నారు. ఎంతో కష్టపడి పంటలను సాగు చేసి యూరియా కోసం నానా తంటాలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని రైతులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం రైతులకు సరఫరా చేస్తున్న యూరియాను ప్రభుత్వం ముందస్తుగా చర్యలు తీసుకుని ఉంటే ఈ ఇబ్బందులు తలెత్తేవి కావని రైతులు పేర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఏ ఒక్క మండలంలో కూడా సక్రమంగా రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయకపోవడం శోచనీయం. జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం 4లక్షల 22వేల 100 ఎకరాల్లో పంట సాగు చేశారు. అందులో పత్తిపంట 2 లక్షల 61వేల 640 ఎకరాలల్లో సాగు చేశారు. వరి పంట లక్షా 1048 ఎకరాలు, మొక్కజొన్న 51,128ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాకు 34,942 టన్నుల యూరియా అవసరానికి గాను ఇంత వరకు 20,686 టన్నులు మాత్రమే సరఫరా చేశారు. అందులో 19,033టన్నులు రైతులకు పంపిణీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 1653 టన్నుల యూరియా నిల్వ ఉంది. ఇంకా జిల్లాకు 14,256 టన్నులు రావాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వం సక్రమంగా యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వం సరఫరా చేయాలి



ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలి. తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

- శంకర్‌గౌడ్, రైతు, తాడూరు మండలం

● సరిపడా యూరియా సరఫరా చేస్తాం



జిల్లాలో యూరియా నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వ సహకార సంఘాలు, ఫర్టిలైజర్ షాపుల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నాం. ప్రతీ రైతుకు యూరియా సరిపడా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మరికొంత యూరియా శనివారం జిల్లాకు రానుంది. ఎలాంటి ఆందోళన చెందాల్సినవసరం లేదు. యూరియా అక్రమంగా నిల్వలు చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- యశ్వంత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

నల్లమలలో టూరిజం అభివృద్ధి

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- సోమశిల, అమరగిరి ఐలాండ్, కృష్ణగిరి ప్రాంతాల్లో వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్టుకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన



అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో టూరిజం చైర్మన్ పటేల్ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

కొల్లాపూర్/మన్ననూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి పర్యాటకులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నల్లమలలో టూరిజం అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని నల్లమల ప్రాంతాల్లో పలు అభివనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ మండల పరిధిలోని కృష్ణానది తీర ప్రాంతమైన అమరగిరి ఐలాండ్‌లో సోమశిల గ్రామాల్లో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి పర్యాటక అభివృద్ధిలో భాగంగా రూ.68.10 కోట్ల అంచనా వ్యయంతో వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్టుకు మంత్రి శంకుస్థాపన చేశారు. అమరగిరి గ్రామంలో నుంచి ఏసీ లాంచీలో అమరగిరి ఐలాండ్‌కు చేరుకుని శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... త్వరలోనే తెలంగాణలో హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సంస్థ సహకారంతో హైదరాబాద్‌కు హెలీ టూరిజం నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీని వల్ల తెలంగాణ పర్యాటక రంగం కూడా కొత్త మలుపు తిరుగుతుందని, దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అమరగిరిలో రూ.45.84 కోట్ల వ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనులు రూ.1.60 కోట్లతో సోమశిల వీఐపీ ఘాట్, బోటింగ్ పాయింట్ కోసం ట్రెంచింగ్ పనులకు పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి మంత్రి జూపల్లి భూమిపూజ చేశారు. విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు మౌలిక వసతుల కల్పనతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించి తద్వారా ఉద్యోగ కల్పనతో పాటు ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగవుతాయని పేర్కొన్నారు. పర్యాటకులను ఐలాండ్ తీసుకువచ్చేలా ఫ్లోటింగ్ జెట్టి ఏర్పాటు

- మిగతా 7లో..

మహిళ దాడిలో వృద్ధుడి మృతి

7

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

- 5.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

6

కేజీబీవీ ఎస్‌వో సస్పెన్షన్

7

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో నాగర్‌కర్నూల్ విద్యార్థుల ప్రతిభ

6

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు శిక్ష

6

సమాచారం ఇవ్వట్లే!

- సమాచార హక్కు చట్టం ఉన్నా లేనట్టే!
- కార్యాలయాల్లో అధికారుల పట్టింపు కరువు
- నేడు వనపర్తి జిల్లాకు రానున్న నలుగురు సమాచార కమిషనర్లు

● ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదీ పరిస్థితి



సమాచార బోర్డు లేని జిల్లా పౌరసరఫరాల కార్యాలయం

వనపర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అపహాస్యంగా మారుతోంది. ఒక విధంగా ఇది ఉండి లేనట్టుగా తయారైంది. గతంలో ఆర్టీఐ కింద ఎవరైనా సమాచారం అడిగితే ఆ కార్యాలయంలోని శాఖలో అవినీతి, అక్రమాలు చేసి ఉంటే అధికారులు భయపడే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు ఇది నిర్వీర్యం కావడంతో వారిని ప్రశ్నించేవారే లేనట్టుగా వ్యవస్థ ఉన్నట్లు ప్రజల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

● జిల్లా కమిటీ ఏర్పాటే లేదు..

స.హ. చట్టం అమలుకు సంబంధించి ప్రతీ జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలని నిబంధన ఉంది. ఇందులో అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉండాలి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈ చట్టం అమలుకు సంబంధించి రివ్యూ నిర్వహించి లోటుపాట్లను సవరించాలి. అయితే అసలు కమిటీ ఏర్పాటుకు ఇప్పటి వరకు అడుగు పడలేదని పౌరులు పేర్కొంటున్నారు. దరఖాస్తుదారునికి 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలని నిబంధన ఉంది. ఆ వ్యవధి దాటిన తరువాత సమాచారం ఇవ్వనందుకు జరిమానా విధించేలా నిబంధనలు ఉన్నాయి. అయితే ఇవన్నీ నామమాత్రంగా మారి ప్రభుత్వ కార్యాలయంలో జవాబుదారితనం లోపించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● నేడు రానున్న సమాచార కమిషనర్లు

జిల్లాలో సమాచార హక్కు చట్టం కింద పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన సమాచార కమిషనర్లు వైష్ణవి మెర్ల, పీవీ శ్రీనివాసరావు, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్య రెడ్డి నేడు జిల్లాకు రానున్నారు. జిల్లాకు 11 గంటల 30 నిమిషాలకు చేరుకొని జిల్లా కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 90 అప్పీళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించి, వాటిని పరిష్కరించనున్నారు. ప్రజలకు సమాచార హక్కు చట్టం కింద ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా కమిషనర్ల దృష్టికి తీసుకురావచ్చని ఉన్నతాధికారులు ఇప్పటికే తెలిపారు.

● 90కి పైగా పెండింగ్ అప్పీళ్లు

జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం కింద 90కి పైగా అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ శాఖల్లో ఉన్న పెండింగ్ అప్పీళ్లపై సమాచారం ఇవ్వాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఒకవేళ దరఖాస్తుదారుడికి సమాచారం ఇచ్చినా అసంపూర్తిగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ప్రధానంగా ఎక్కువగా మునిసిపల్, రెవెన్యూ, డీఆర్డీఏ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై సమాచార హక్కు చట్టం కింద వివరణ కోరితే పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు మండిపడుతున్నారు.

● అసంపూర్తిగా సమాచారం ఇస్తున్నారు



తిరుమలేష్, సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారుడు: జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టంపై సంబంధిత అధికారులు అప్పీలేట్ అథారిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. వనపర్తి మునిసిపల్ కార్యాలయంతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశాను. మునిసిపల్ కార్యాలయంలో అసంపూర్తి సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోలేదు. నేడు జిల్లాకు వచ్చే సమాచార కమిషనర్లు సమాచార హక్కు చట్టంపై పకడ్బందీగా చర్యలు తీసుకునేలా చొరవ తీసుకోవాలి. పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లను సత్వరమే పరిష్కరించాలి.

పారదర్శకమైన పాలన కోసమే స.హ. చట్టం

- మూడేళ్లలో 17వేల దరఖాస్తులు పెండింగ్
- స.హ. చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్ రావు



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న స.హ. చట్టం కమిషనర్ శ్రీనివాసరావు

గద్వాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పారదర్శకమైన పాలన కోసమే సమాచార హక్కు చట్టం-2005లో తీసుకవచ్చారని ప్రతీ ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలని కమిషనర్ పీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం స.హ. చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, వైష్ణవితో కలిసి జిల్లాలో ఆయన పర్యటించారు. ఐడీఓసీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుతమైన పాలన అందించడంలో సమాచార హక్కు చట్టం కీలకమైనదని వివరించారు. ఆర్టీఐ దరఖాస్తులు తక్కువగా ఉన్న జిల్లా జోగుళాంబ గద్వాల మాత్రమేనని ఆయన వివరించారు. ఆర్టీఐ దరఖాస్తుదారులకు ఆలస్యం చేయకుండా సమాచారం త్వరగా అందించాలని ఆయన సూచించారు. గత మూడేళ్లలో సమాచారం ఇవ్వకుండా ఉన్న 17వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకే జిల్లాల పర్యటన చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటి వరకు ఎనిమిది జిల్లాల్లో పర్యటించి అక్కడి కక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. దేశంలో చట్టం అమలులో 8వ స్థానంలో ఉన్నామని, రాబోయే రోజుల్లో నెంబర్ వన్ స్థానానికి రావాలని ఆయన సూచించారు. రాష్ట్ర సమాచార కమిషనర్లు దేశాల భూపాల్, వైష్ణవిలు అధికారులకు ఆర్టీఐ యాక్ట్‌పై దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావులు కమిషనర్లను సత్కరించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో అలివేలు తదితరులు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు వైష్ణవి మెర్ల, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్య రెడ్డితో కలిసి అలంపూర్ ఐదవ శక్తి పీఠం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

పర్యావరణహిత సంచులొచ్చేశాయ్

- జోగుళాంబ గద్వాల జిల్లాలో రేషన్ లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం



అయిజ గోదాంలో డీలర్లకు సంచులను అందిచేస్తున్న అధికారులు

7

ట్రిపుల్ ఐటీకి సర్వం సిద్ధం

- కళాశాలకు ఎంపికైన 210 మంది విద్యార్థులు
- పాలమూరు రెడ్డి వసతి గృహంలో పూర్తయిన ఏర్పాట్లు



రెడ్డి వసతి గృహంలో సిద్ధమైన ఓ తరగతి గది

7

యూరియా కోసం తప్పని పాట్లు

- క్యూలైన్లలో పాసుబుక్కులు, ప్లాస్టిక్ సంచులు
- మధ్యాహ్న సమయానికే 450 బస్తాలు క్లోజ్

6

వ్యక్తిపై దాయాదుల దాడి

- ఖిల్లాఘణపురం మండలం వసురాం తండాలో ఘటన

6

గ్రామాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి

- పనుల జాతర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్

గద్వాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతరతో గ్రామాల అభివృద్ధి జరగడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జిల్లెడబండ గ్రామంలో పనుల జాతర-2025ను కలెక్టర్ బీఎం సంతోష్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంతో గద్వాలలో గత ఏడాది రూ.13కోట్ల పనులు నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ ఏడాది వంద రోజుల పనిదినాలను కల్పించి కొత్త పనులను చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలల వద్ద మరుగుదొడ్లు నిర్మించి సమస్య పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. రూ.20లక్షలతో గ్రామంలో కొత్త జీపీ భవనం నిర్మించనున్నట్లు, కాంట్రాక్టర్లు దీనిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎంపీడీవో ఉమాదేవి, పంచాయతీ రాజ్ డీఈ కబీర్‌దాస్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జంబురామన్‌గౌడ్, మజీద్, ఏఈ బషీర్, గ్రామ కార్యదర్శి కవిత, గ్రామ సంఘం అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.రవికుమార్

తెలకపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ శుక్రవారం ఆకస్మికంగా పెద్దూరు, బొప్పల్లి, అంబటిపల్లి, లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతిరోజు 9 గంటల నుంచి 4 గంటల వరకు ఓపీ సేవలు అందించాలని, ఆసుపత్రి ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులకు, ఇతర వైద్య సిబ్బందికి సూచించారు.

హైరిస్క్ గర్భవతులను ప్రాథమిక దశలోనే గుర్తించి తాలూకా, జిల్లా ఆసుపత్రులలో ప్రసవించే విధంగా ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఫ్రై డే డ్రై డే ఆక్టివిటీని పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ దశరథ్, డాక్టర్ జయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు
కొనసాగుతున్న వరద

» 5.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు 5.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు పది గేట్లను 18 ఫీట్ల మేరకు ఎత్తి 4,21,530 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 64,9623 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 199.735 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2.61 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నదిపై ఉన్న సన్నతి బ్యారేజీ నుంచి 1.20 లక్షల క్యూసెక్కులను జూరాలకు విడుదల చేశారు. ప్రస్తుతం జూరాలకు 3.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 37 గేట్లను ఎత్తి 3.67 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. నీటి విడుదల పెరగడంతో వరద రివర్స్‌లో విద్యుత్ ఉత్పాదన వైపు మళ్లడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి 1.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 1.35 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

తగ్గిన వరద ఉధృతి

» 'సంగంబండ' ఒక గేటు ద్వారా నీటి విడుదల

» మూతబడిన కోయిల్‌సాగర్ గేట్లు

మక్తల్‌రూరల్/ దేవరకద్ర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయానికి, మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. సంగంబండ జలాశయానికి పెద్ద వాగు నుంచి వరద కొనసాగుతుండటంతో ఒక గేటు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 500 క్యూసెక్కులు కాగా, వచ్చిన నీటిని వచ్చినట్లుగా విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.65 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ సురేశ్ తెలిపారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం తగడంతో గేట్లు మూసివేసినట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 32.5 అడుగులు కాగా, శుక్రవారం సాయంత్రానికి 31.6 అడుగులకు చేరింది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలోని ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతోంది.

24న యోగా జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళలు, పురుషుల జట్లను ఈ నెల 24న ఎంపిక చేయనున్నట్లు యోగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్. బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఇండోర్‌స్టేడియంలో ఎంపికలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నమని, సంఘం సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

కరెంట్ కట్ చేశారని
వ్యక్తి ఆత్మహత్యాయత్నం

» జనరల్ ఆసుపత్రిలో చికిత్స.. పరిస్థితి విషమం

మహబూబ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :తాను నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌కు రెండు నెలలుగా కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో లైన్‌మన్ కరెంట్ కట్‌చేశాడు. శుక్రవారం కరెంట్ బిల్లు చెల్లించి వెంటనే కనెక్షన్ పునరుద్ధరించాలని కోరగా లైన్‌మన్ కాలయాపన చేస్తుండటంతో సబ్‌స్టేషన్ ముందే గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గండీడ్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రెడ్డిపల్లికి చెందిన సోంభూపాల్‌రెడ్డి గండీడ్ మండల కేంద్రంలో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. రెండు నెలల కరెంట్ బిల్లు రూ.24 వేలు బకాయి ఉండటంతో లైన్‌మన్ మన్నాజి రెండురోజుల క్రితం కరెంట్ చేశాడు. దీన్ని అవమానంగా భావించిన భూపాల్‌రెడ్డి శుక్రవారం ఉదయం 11:30 గంటలకు బిల్లు చెల్లించాడు. ఆ తరువాత నేరుగా సల్కర్‌పేట సబ్‌స్టేషన్ వెళ్లి ఏఈని కలిశారు. కరెంట్ పునరుద్ధరించాలని కోరారు. కొద్ది సేపటి తరువాత ఇస్తామని చెప్పగా వెళ్లిపోయారు. మళ్లీ మధ్యాహ్నం ఒంటిగంటకు సబ్‌స్టేషన్ చేరుకుని ఏఈని కలిశాడు. లైన్‌మన్ మన్నాజిని పిలిచి అడగగా అతకు పని ఉందని, 2 గంటల తరువాత వచ్చి ఇస్తానని చెప్పడంతో ఇబ్బందిగా భావించిన భూపాల్‌రెడ్డి నీ కరెంట్ వద్దు మీరొద్దనుకుంటూ బయటకు వెళ్లి వెంట తెచ్చుకుని గడ్డిమందు తాగాడు. గమనించిన సిబ్బంది వెంటనే అతని చేతిలో డబ్బా లాక్కుని చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడే చికిత్స పొందుతున్నాడు. గడ్డిమందు కావడంతో అప్పుడే ఏమీ చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు.

వ్యక్తిపై దాయాదుల దాడి

ఖిల్లాఘణపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాయాదులు దాడి చేశారు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని వసురాం తండాలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... ఈనెల 20న తండాకు చెందిన మూడావత్ గౌడ్యా ఇంటికి దాయాదులు మూడావత్ శంకర్, అతడి భార్య ఘంసీ, కుమార్తె అనూష, మూడావత్ శ్రీను వెళ్లి దూర్భాషలాడారు. ముడావత్ శ్రీను గౌడ్యాపై దాడి చేశాడు. మళ్లీ ఈ నెల 21న గౌడ్యా ద్విచక్ర వాహనంపై తండా నుంచి ఖిల్లాఘణపురం వైపు వెళ్తుండగా, పిల్లివాగు వద్ద మూడావత్ శ్రీను, మూడావత్ రవి, మూడావత్ శంకర్, మూడావత్ నితేష్ అడ్డుకున్నారు. మాట్లాడుకుందామని పొలం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మాటా మాటా పెరగడంతో, గౌడ్యాపై దాడి చేసి గాయపరిచారు. సంఘటనపై బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో
ఏడుగురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం/ తెలకపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండ స్టేజీ వద్ద పోలీసులు ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడూరు మండలం భలాన్‌పల్లి గ్రామానికి చెందిన బీర్ల శ్రీశైలం, నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన ఎండీ ఆరిఫ్, లింగాల మండలం బాకారం గ్రామానికి చెందిన అర్జున్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబట్టారు. వారిని అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం జిల్లా కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులు బీర్ల శ్రీశైలానికి 20 రోజుల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా, ఎండీ ఆరీఫ్, అర్జున్‌లకు ఒక రోజు జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి శ్రుతిదూత తీర్పు వెల్లడించారు. అలాగే తెలకపల్లి మండలానికి చెందిన లక్ష్మయ్య, మల్లేశ్, శ్రీనివాసులు, తిరుపతయ్యలు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. నలుగురికీ ఒక రోజు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉంటే
పోటీకి దూరమేనా!



» నిబంధనపై కొనసాగుతున్న సందిగ్ధం

» పల్లె పోరు నేపథ్యంలో తెరపైకి వచ్చిన అంశం

» నోటిఫికేషన్‌కు ముందే నిర్ణయానికి కసరత్తు

» ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశావహుల ఎదురుచూపులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు చివరి మాసంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగించేందుకు కసరత్తు ప్రారంభించనున్నది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఇప్పటికే ఓటరు జాబితా తుది ముసాయిదాను రూపొందించారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ ముద్రణ కూడా 80 శాతం వరకు పూర్తి చేశారు. ఎన్నికల సామాగ్రిని సైతం జిల్లాలోని 16 మండలాలకు పంపిణీ చేశారు. ఈ కీలక తరుణంలో ఇద్దరు పిల్లల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ సంతానం ఉన్న వారికి కూడా స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం కూడా పాత నిబంధనను మార్చాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. స్థానిక నాయకత్వం నుంచి వస్తున్న ప్రతిపాధనలను పరిగణలోకి తీసుకొని నిబంధనలు మార్చి ఎన్నికలు నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించేందుకు అధికారులతో మంతనాలు జరుపుతున్నట్లు రాజకీయ పార్టీల్లో జోరుగా చర్చ సాగుతుంది.

1995లో అమలులోకి..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలని 1995లో, అప్పటి ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం ఇద్దరు కన్నా ఎక్కువ సంతానం కలిగి ఉన్న వారు సర్పంచు, ఎంపీటీసీ, జడ్‌పీటీసీ, కౌన్సిలర్ స్థానాలకు పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించింది. ఈ చట్టం అమలులోకి వచ్చి దాదాపు మూడు దశాబ్దాలు కావస్తుంది. అప్పటి నుంచి ఎన్నికల్లో పోటీ చేసే సామర్థ్యం ఉండి, అంగ, అర్థ బలం ఉన్నా, అధిక సంతానం కలిగిన వారు స్థానిక పోరులో నిలబడే అవకాశం లేదు. దీంతో తమ అనుచరులను రంగంలోకి దించాల్సి వస్తోంది. ఈ చట్టాన్ని సవరిస్తే వారందరూ ప్రత్యక్షంగా ఎన్నికల బరిలో దిగే అవకాశం ఉంది.

కోర్టులను ఆశ్రయిస్తున్న ప్రత్యర్థులు

ఎక్కువ మంది సంతానం ఉన్నవారు కొందరు ఎన్నికల అఫిడవిట్‌లో ఇద్దరే ఉన్నట్లు చూపించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భాలున్నాయి. తీరా విజయం సాధించి, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవులను చేపట్టాక ప్రత్యర్థులు వారిపై కోర్టులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పదవులను కోల్పోయిన వారున్నారు. ఇద్దరు సంతానం నిబంధనను ప్రభుత్వం సడలిస్తే ఇలాంటి సంఘటనలకు ఆస్కారం ఉండదు.

మునిసిపాలిటీల్లో చట్ట సవరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు సంతానం నిబంధనను గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో సవరించింది. ఎక్కువ సంతానం ఉన్నా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించింది. అలాగే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా చట్టాన్ని సవరణ చేస్తుందని ఆశావహులు భావిస్తున్నారు.

ఇంకా నిర్ణయం తీసుకోలేదు



ఇద్దరు పిల్లల నిబంధనపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నిర్ణయం తీసుకున్న వెంటనే, అన్ని గ్రామాలకు సర్క్యులర్ పంపిస్తాం. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ సంతానం కలిగి ఉన్న వారు స్థానిక సంస్థలలో పోటీ చేయడానికి అనర్హులు. ఎవరైనా తప్పుడు అఫిడవిట్‌తో పోటీ చేసి గెలిచినా, ఎన్నిక చెల్లదు. కవల పిల్లలు ఉండి, ఆ తర్వాత మరో సంతానం ఉంటే స్థానిక పోరులో పోటీ చేయొచ్చు.

\- పార్థసారథి, డీపీవో

యూరియా కోసం తప్పని పాట్లు

» క్యూలైన్లలో పాసుబుక్కులు, ప్లాస్టిక్ సంచులు

» మధ్యాహ్న సమయానికే 450 బస్తాలు క్లోజ్

» వెనుదిరిగి వెళ్లిపోయిన పలువురు రైతులు



ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయంలో వరుస క్రమంలో నిలబడిన రైతులు

గట్టు/ నారాయణపేట/ ఆత్మకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులకు కష్టాలు తప్పడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టులోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి శుక్రవారం ఉదయమే అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఎదురు చూస్తూ నిలబడలేక, క్యూలైన్లలో పాసుబుక్కులు, చెప్పులు ఉంచారు.

కానీ అందు బాటులో ఉన్న 450 బస్తాల యూరియా మధ్యాహ్నం సమయానికి అయిపోయింది. దీంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మళ్లీ రెండు రోజుల తర్వాత యూరియా వస్తుందని మండల వ్యవసాయ అధికారి హన్మంతురెడ్డి తెలిపారు.

● నారాయణపేట జిల్లా, ధన్వాడలోని సింగిల్ విండో కార్యాలయానికి శుక్రవారం యూరియా లోడ్ రావడంతో రైతులు ఒక్కసారిగా తరలివచ్చారు. యూరియా బస్తాలు దక్కించుకునేందుకు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. విండో కార్యాలయ సిబ్బంది రైతులకు క్రమ పద్ధతిలో యూరియాను అందించారు.

● వనపర్తి జిల్లా, ఆత్మకూరులోని సహకార సంఘం కార్యాలయానికి గురువారం యూరియా రాలేదు. దీంతో శుక్రవారం అత్యధిక మంది రైతులు కార్యాలయానికి చేరుకొని వేచి ఉన్నారు. చివరకు సాయంత్రం 5 గంటల సమయంలో 600 బస్తాల యూరియా వచ్చింది. దీంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు యూరియాను పంపిణీ చేయించారు.

యూరియా అక్రమ రవాణా

» కర్ణాటకకు తరలిస్తుండగా పట్టివేత

» 34 బస్తాల యూరియా, కాంప్లెక్స్ ఎరువుల స్వాధీనం



పేట పోలీస్‌స్టేషనల్‌లో పట్టుబడ్డ యూరియా, కాంప్లెక్స్ ఎరువులు గల ఆటో, రెండు జీపులు

నారాయణపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న యూరియాను పోలీసులు పట్టుకున్నారు. 34 బస్తాల యూరియా, కంప్లెక్స్ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట పట్టణంలోని సౌజన్య ఫర్టిలైజర్ నుంచి 3 యూరియా, 14 కాంప్లెక్స్ బస్తాలను ఆటోలో కర్ణాటకకు తరలిస్తుండగా జిలాల్‌పూర్ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నుంచి 11 యూరియా, 6 కాంప్లెక్స్ ఎరువుల బస్తాలను కూడా కర్ణాటకకు తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటకకు చెందిన రైతులు అంజప్ప, మాణికప్ప, తాయప్పలు ఇక్కడి నుంచి యూరియా, ఎరువుల బస్తాలను అక్రమంగా తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు బాలదినకర్, అనిల్‌కుమార్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో
పాడి ఆవు మృతి

చారకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని జూపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు గూడూరు కిరణ్ శుక్రవారం ఉదయం తన ఆవును పొలంలో మేతకు వదిలాడు. అది పచ్చిగడ్డి మేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన పాడి ఆవు విలువ రూ. 1.30 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు.



మృతి చెందిన పాడి ఆవు

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర

కోయిలకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతీ ఒక్కరిరు అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర అన్నారు. ప్రపంచ స్వదేశీ ప్రజల దినోత్సవం సందర్భంగా మండలంలోని చింతల్‌తండా, కోయిలకొండ కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని, మాట్లాడారు. బాల కార్మిక చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలు, విద్యాహక్కు చట్టాల గురించి వివరించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని తెలిపారు. కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపాజీ, ఎంఈవో వెంకటజీ, కేజీబీవీ ప్రిన్సిపాల్ హారిక పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

» మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్



జడ్చర్ల మునిసిపల్ పట్టణ యూనియన్ మహాసభల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల వేతనాలను పెంచి, పర్మినెంట్ చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. జడ్చర్లలోని కెంచెలింగ మణెమ్మ ఫంక్షన్ హల్‌లో శుక్రవారం నిర్వహించిన జడ్చర్ల మునిసిపల్ యూనియన్ పట్టణ నాల్గవ మహా సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిగ్నల్‌గడ్డ నుంచి ఫంక్షన్‌హల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహా సభల ప్రాంగణం వద్ద సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. మునిసిపాలిటీలో అనేక రూపాల్లో ఆదాయంలో, అందంలో చక్కగా తీర్చిదిద్దే కార్మికులందరూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో వెట్టిచాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రావలసిన అన్ని రకాల బెనిఫిట్‌లు, పీఎఫ్, ఈఎస్‌ఐ, డెత్ క్లెయిమ్‌లు ఇతర సౌకర్యాలు, పెండింగ్ క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వేతనాలను పెంచి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన, పోరాటాల బాటలో పయనిస్తామని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల వెంకటేశ్, ఎర్ర నరసింహులు, సీఐటీయూ నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి, ఖమర్‌అలీ, జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, వెంకటేశ్‌గౌడ్, వీరాంజనేయులు, జగన్ పాల్గొన్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్
గౌరవ సభ్యుడిగా మధుసూదన శర్మ



మధుసూదన శర్మ

కొల్లాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ ప్రాంత వాసి, కవి, రచయిత వేదార్థం మధుసూదనశర్మ తెలంగాణ సారస్వత పరిషత్తు సర్వసభ్య మండలి గౌరవ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు, ఉపాధ్యాయులు డాక్టర్ గుడేలి శీనయ్య, బస్వోజు సుధాకారాచారి, ఆమని కృష్ణ, వేముల కోటయ్య, రంగినేని శ్రీధర్, గడ్డికోపుల పరశురాముడు, పోతురాజు నారాయణ, శ్రీదేవి, అనిత, వరలక్ష్మి, పావని శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో
నాగర్‌కర్నూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కందనూలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి అండర్-17 బాలుర 64-సుబ్రతో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలల్లో పాఠశాల బాలుర జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది. దీంతో ఈ నెల 25, 26 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ పాల్గొనేందుకు జట్టు క్రీడాకారులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫాతిమారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జగదీశ్, పీటీ వీరప్ప, రామన్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ మొదటి స్థానం సంపాదించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

» ఫైనల్‌కు చేరిన స్వామీ నారాయణ, శ్లోక పాఠశాలల జట్లు



జడ్చర్ల మినీస్టేడియంలో సెమీఫైనల్ మ్యాచ్‌లో తలపడిన పాఠశాలల జట్లు

జడ్చర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో 18వ అంతర పాఠశాలల క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. పోటీలలో 14 పాఠశాలల జట్లు పాల్గొంటున్నాయి. శుక్రవారం ఉదయం ఉదయ మెమోరియల్ హైస్కూల్, స్వామీ నారాయణ గురుకుల పాఠశాల జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన స్వామీ నారాయణ గురుకుల పాఠశాల జట్టు 15 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉదయ మెమోరియల్ హైస్కూల్ జట్టు 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 91 పరుగులు మాత్రమే చేసింది. 61 పరుగుల తేడాతో స్వామీ నారాయణ గురుకుల పాఠశాల జట్టు ఫైనల్‌కు చేరింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీచైతన్య, శ్లోక పాఠశాలల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్లోక పాఠశాల జట్టు 9.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 66 పరుగులు చేసి విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. శనివారం స్వామీ నారాయణ గురుకుల, శ్లోక పాఠశాల జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు కోచ్‌లు మోయిన్, మహేశ్ తెలిపారు.

హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా క్రీడాకారుడి ప్రతిభ

» మహ్మద్ అద్నానుద్దీన్ అర్ధ సెంచరీ



అర్ధసెంచరీతో రాణించిన జిల్లా క్రీడాకారుడు అద్నానుద్దీన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీ-డివిజన్ వన్డే టోర్నీలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ అద్నానుద్దీన్ ప్రతిభ చాటాడు. హైదరాబాద్‌లోని, ఘట్‌కేసర్ ఎంఎస్ మైదానంలో శుక్రవారం జరిగిన ఈ టోర్నీలో అతడు హైదరాబాద్ వండర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. రంగారెడ్డి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో వండర్స్ జట్టు 44 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 403 పరుగులు చేసింది. అద్నానుద్దీన్ 47 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో అర్ధసెంచరీ(78) చేసి జట్టు విజయానికి కృషి చేశాడు.

క్రైం కార్నర్

ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

» కుటుంబ కలహాలే కారణం


పూర్ణ (ఫైల్)

జడ్చర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలను భరించలేక ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల పట్టణంలోని సాయిమందిరానికి వెళ్లే దారిలో ఉండే వెంకటేశ్వరకాలనీలో ముడావత్ పూర్ణ(39), పాత్లావత్ గోప్య నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముడావత్ పూర్ణ జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త పాత్లావత్ గోప్య పెద్ద తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం ఉదయం గోప్య నాయక్ పాఠశాలకు వెళ్లిన తర్వాత, పూర్ణ పిల్లలను బడికి పంపించింది. ఆ తర్వాత ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మరికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. నారాయణపేట జిల్లా, మరికల్ మండల పరిధిలోని అప్పంపల్లిలో గురువారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన సంజనోళ్ల అనంతమ్మ (57) గురువారం సాయంత్రం తన భర్త బాల్‌రెడ్డి దుస్తులను ఇస్త్రీ చేస్తోంది. ప్రమాదవశాత్తు ఐరన్ బాక్స్‌కు షార్ట్‌సర్క్యూట్ కావడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు ఆమెను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. సంఘటనపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నవాబ్‌పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి, ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని కాకర్జాల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ విక్రం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుర్రంపల్లి చెన్నయ్య (37) ఈ నెల 20న గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి, ఇంటికి తిరిగి రాలేదు. ఆ సమయంలో అతడి భార్య స్వప్న వరి నారు వేసేందుకు బాలనగర్ మండలంలోని ఉడిత్యాలలోని బంధువుల వద్దకు వెళ్లింది. తండ్రి ఇంకా ఇంటికి రాలేదని కుమార్తె నందిని ఆమెకు సమాచారం ఇచ్చింది. స్థానికులను ఆరా తీయగా చెన్నయ్య కాకర్జాల పెద్ద చెరువు గట్టుపై నడుచుకుంటు వెళ్తుండగా చూసినట్లు తెలిపారు. దీంతో చెరువు పరిసరాల్లో వెతికారు. మరుసటి రోజు చెరువులో ఆయన మృతదేహం తేలడంతో గ్రామస్థుల సాయంతో బయటకు తీశారు. సంఘటనపై కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ దాడిలో వృద్ధుడి మృతి


రాంరెడ్డి పల్లిలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కల్వకుర్తి డీఎస్పీ వెంకటరెడ్డి

ఊర్కొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళ దాడి చేయడంతో వృద్ధుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని రాంరెడ్డిపల్లిలో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జమ్ముల లక్ష్మీదేవమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని ఏడు, ఎనిమిది సంవత్సరాల క్రితం భర్త వదిలేశాడు. అప్పటి నుంచి ఆమె తల్లి వద్దనే ఉంటోంది. ఆమె ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లోని ఆమె భర్త వద్ద నివసిస్తున్నారు. గ్రామంలో కావలి కారుడిగా పని చేస్తున్న గుర్రంపల్లి రాములు (65) గురువారం రాత్రి ఆమె ఇంటి ముందు నుంచి వెళ్తుండగా లక్ష్మీదేవమ్మ కర్రతో అతడి తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనపై అతడి కుమారుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ నాగార్జున శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇటిక్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇటిక్యాల ఎస్‌ఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామానికి చెందిన గొల్ల శేఖర్ అలియాస్ వీరేశ్ (26) మద్యానికి బానిసయ్యాడు. గత నెల 28న మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని తల్లి చిన్నక్కను అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. సంఘటనపై యువకుడి తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ క్యాబిన్

కల్వకుర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ఓ లారీ డివైడర్‌ను ఢీకొన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోదాడ నుంచి తెలకపల్లికి వెళ్తున్న లారీ, కల్వకుర్తిలోని జాతీయ రహదారిపై, హరిహర టౌన్‌షిప్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్నది. దీంతో లారీ ముందు భాగం ధ్వంసం కాగా, ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహమ్మదాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, మహ్మదాబాద్ మండలంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన చెన్నయ్య (56) శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనం (లూనా)పై మహమ్మదాబాద్‌కు బయలుదేరాడు. జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న ఫామ్ హౌస్ కంచెకు ఉన్న రాతి కడీకి బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ట్రిపుల్ ఐటీకి సర్వం సిద్ధం



ట్రిపుల్ ఐటీ కళాశాలను నిర్వహించనున్న భవనం


వసతి గృహంలో ఏర్పాటు చేసిన మంచాలు, పరుపులు

» కళాశాలకు ఎంపికైన 210 మంది విద్యార్థులు
» పాలమూరు రెడ్డి వసతి గృహంలో పూర్తయిన ఏర్పాట్లు
» పర్యవేక్షించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థుల చిరకాల స్వప్నం సాకారం అవుతోంది. కార్పొరేషన్ పరిధిలోని వీరన్నపేట సమీపంలో ఉన్న రెడ్డి హాస్టల్ భవనంలో, బాసర క్యాంపస్ తరహాలో రాష్ట్రంలోనే రెండవ ట్రిపుల్ ఐటీ కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఎప్పటికే దరఖాస్తు చేసుకోగా, పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 210 మందిని ఎంపిక చేశారు. వీరందరూ ఆయా కోర్సుల్లో ఆరేళ్ల పాటు విద్యాభ్యాసం చేయనున్నారు.

అందులో రెండేళ్ల పాటు ఇంటర్మీడియట్ (పీయూసీ-1) నాలుగేళ్ల ఐటీ కోర్సుల్లో (పీయూసీ-2) శిక్షణ పొందను న్నారు. పీయుసీ 1 పూర్తి చేసుకున్న తర్వాత విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీఎస్ఈ, ఏఐ ఎంఎల్, డాటా సైన్స్ కోర్సుల్లో సీట్లు కేటాయిస్తారు. అందులో విద్యార్థులకు వారికి నచ్చిన విభాగాలను ఎంపిక చేసుకొనే అవకాశం ఉంటుంది. ఒక్కో కోర్సుల్లో 60 సీట్లు ఉండగా, ఈ డబ్ల్యూఎస్, స్పోర్ట్స్, పీహెచ్‌సీ తదితర కోటాల కింద మరో 10 సీట్లు అదనంగా ఉంటాయి.

మొత్తం మూడు కోర్సుల్లో 210 సీట్లను భర్తీ చేశారు. ఎంపికైన విద్యార్థులు గురువారమే కళాశాలకు వచ్చి రిపోర్ట్ చేయాల్సి ఉండింది.

కానీ వారం రోజుల కురుస్తున్న వర్షాల కారణంగా వాయిదా పడింది. వచ్చే వారంలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు కళాశాల పర్యవేక్షకుడిగా వచ్చిన డాక్టర్ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

తాత్కాలిక భవనంలో తరగతులు

ట్రిపుల్ ఐటీ కళాశాలకు శాశ్వత భవనం కోసం జిల్లా కేంద్ర సమీపంలోని దివిటిపల్లి, జడ్చర్ల, మల్లబోయినపల్లి పరిధిలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న 43 ఎకరాల భూమిని కేటాయించారు. అక్కడ శాశ్వత భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు జిల్లా కేంద్రం లోని రెడ్డి హాస్టల్ (రాజా బహద్దూర్ వెంకట్ రాంరెడ్డి కళాశాల) భవనంలో తాత్కాలిక తరగతులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పా ట్లు పూర్తి చేశారు. తరగతి గదులు, వసతి గృహం, భోజనశాల, ప్రయోగశాల తదితర వసతులను అందుబాటులోకి తెచ్చారు. గరగతి గదుల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఎంపికైన విద్యార్థుల్లో బాలికలు 144 మంది, బాలురు 66 మంది ఉన్నారు. విద్యాబోధన కోసం 10 మంది అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిని నియమించారు. ఏర్పాట్లను ఇటీవల ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పర్యవేక్షించారు.

పూర్తయిన ఏర్పాట్లు



ట్రిపుల్ ఐటీ తరగతుల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. శుక్రవారం నుంచి ఓరియెంటేషన్ తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా, వర్షాల కారణంగా వాయిదా వేశాం. ఈ మేరకు విద్యార్థులకు సమాచారం అందించాం. వచ్చే వారంలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీనిపై బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ఏ గోవర్ధన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- డాక్టర్ శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకుడు

పర్యావరణహిత సంచులొచ్చేశాయ్

» రేషన్ లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం



ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు అందించే బ్యాగు

అయిజ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రేషన్ దుకాణాల నుంచి సన్న బియ్యం తీసుకెళ్లే లబ్ధిదారులకు ప్రభుత్వం పర్యావరణహిత సంచులను పంపిణీ చేయనున్నది. రేషన్ కార్డుల సంఖ్య ఆధారంగా వీటిని డీలర్లకు అందించనున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని 13 మండలాల్లో రేషన్ దుకాణాలకు సంచులను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జిల్లా పరిధిలో గద్వాల, అయిజ, మానవపాడు, అలంపూర్‌లలో సివిల్ సప్లయ్ గోదాములున్నాయి. ఆయా గోదాములకు పర్యావరణ హిత సంచులు ఇప్పటికే చేరాయి. జిల్లాలోని 335 రేషన్ దుకాణాలకు వీటిని సరఫరా చేయనున్నారు. మొత్తం 1,56,707 రేషన్‌కార్డుదారులకు ఈ సంచులను అందించనున్నారు. వారితో పాటు కొత్తగా రేషన్‌కార్డులు పొందిన 35,672 మందికి కూడా వీటిని పంపిణీ చేయనున్నారు. శుక్రవారం సాయంత్రం అయిజలోని గోదాంకు 59,458 సంచులు వచ్చాయి. జిల్లాలోని అన్ని గోదాములకు సంచులను చేర్చినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామికుమార్ తెలిపారు. వీటిని డీలర్ల ద్వారా లబ్ధిదారులకు వచ్చే నెల బియ్యంతో పాటు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

అభయ హస్తం లోగో

పర్యావరణహిత సంచులపై అభయ హస్తం లోగోతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ ఫొటోలను ముద్రించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రం కూడా ఉంది. అందరికీ సన్న బియ్యం - ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం, ప్రగతి పథం, సకల జన హితం, మన ప్రజా ప్రభుత్వం అనే నినాదాలు ముద్రించి ఉన్నాయి.

నల్లమలలో టూరిజం అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం పర్యాటక రంగంలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

కృష్ణగిరిలో రూ.20కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం


కృష్ణగిరిలో పర్యాటక అభివృద్ధి పనుల శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

నల్లమలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని కృష్ణగిరి(ఈగలపెంట) వద్ద వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్టులో భాగంగా రూ.20కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి పనులకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. రూ.3.60కోట్లతో చెంచు మ్యూజియం పునరుద్ధరణ సివిల్ పనులు, నీటి సదుపాయం, శానిటరీ ఎలక్ట్రికల్ సౌకర్యాల కల్పన, రూ.8.36 కోట్లతో అరైవల్ జోన్ ప్రొమెనెడ్ అభివృద్ధి పనులు, 7.69 కోట్లతో కృష్ణగిరి రివర్ క్రూయిజ్‌నోడ్ రూఫ్‌టాప్ కేఫే, వ్యూయింగ్ డెక్, నీటి సరఫరా సానిటరీ, ఎలక్ట్రికల్, ల్యాండ్ స్కేప్ పనులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో నల్లమలను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. బ్రహ్మగిరి, కృష్ణగిరి ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్, స్థానిక కాంగ్రెస్ నాయకులు చత్రూనాయక్, శ్రీను పాల్గొన్నారు.

రంగనాయకస్వామి గుట్టపై 'అవంతిక-2' షూటింగ్

» క్లాప్ కొట్టి ప్రారంభించిన మాజీ మంత్రి


హీరో, డైరెక్టర్ శ్రీరాజ్‌భల్లా, క్రియేటివ్ డైరెక్టర్ ఫణిరాజ్‌గౌడ్‌కు స్క్రిప్ట్‌ను అందచేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని రంగనాయకస్వామి గుట్టపై శుక్రవారం 'అవంతిక-2' షూటింగ్ సందడి మొదలయ్యింది. కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సి.లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హీరో, దర్శకుడు శ్రీరాజ్‌భల్లా, హీరోయిన్ గీతాంజలిలతో కలిసి రంగనాయకస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయం ముందు ముహూర్తం షాట్‌కు మాజీ మంత్రి క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో షూటింగ్ స్పాట్‌లు అనేకం ఉన్నాయన్నారు. అవంతిక చిత్రబృందం గతంలోనూ ఇక్కడ సినిమా షూటింగ్ చేసిందని తెలిపారు. హీరో, హీరోయిన్లు, జడ్చర్ల వాస్తవ్యుడు, క్రియేటివ్ డైరెక్టర్ ఫణిరాజ్‌గౌడ్‌లు మాట్లాడుతూ కామెడీ హర్రర్ జోనర్‌లో సినిమా ఉంటుందని తెలిపారు. జడ్చర్ల కళాకారులను ప్రోత్సహించేందుకు త్వరలోనే ఆడిషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన వారికి తమ సినిమాలో నటించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నటి అనురాధచౌదరి, కెమెరామెన్ రమేశ్, మ్యూజిక్ డైరెక్టర్ రవివర్మ, నటులు దేవరాజ్, కార్తికేయ, రమణాచార్యులు పాల్గొన్నారు. సినిమా బృందానికి శ్రీరంగనాయకస్వామి దేవాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మిడ్జిల్ బంద్ సంపూర్ణం

» తహసీల్దార్‌కు వినతి పత్రం



తహసీల్దార్ రాజుకు వినతి పత్రం ఇస్తున్న వ్యాపార సంఘం నాయకులు

మిడ్జిల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్‌లో శుక్రవారం నిర్వహించిన బంద్ విజయవంతం అయ్యింది. వ్యాపారసంఘం మండల అధ్యక్షుడు గంజి కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వ్యాపారులు దుకాణాలను మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంజి కృష్ణ మాట్లాడుతూ మార్వాడీ వ్యాపారులు నకిలీ వస్తువులను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బంగారు దుకాణాలను ఏర్పాటు చేసి విశ్వకర్మలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. ర్యాలీలో వ్యాపార సంఘం ఉపాధ్యక్షుడు ఎల్మశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జహంగీర్, శ్రీధరాచారి, రమేషాచారి, బాలనారాయణ, జహీర్, బాలకిషన్, వెంకట్‌రెడ్డి, సిరాజుద్దీన్, రాములు, సాబేర్, నారాయణ, లాలు, శ్రీనివాసులు, పురుషోత్తం, సత్యనారాయణ, వెంకటేశ్, సతీశ్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ. 35 లక్షలు ఇవ్వాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


భూనిర్వాసితులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నారాయణపేట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములను కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరానికి రూ. 35 లక్షలు పరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.సాగర్, రాష్ట్ర నాయకుడు ఆర్.వెంకట్రాములుతో కలిసి శుక్రవారం నారాయణపేట మండలంలోని పేరపళ్ల గ్రామంలో పర్యటించారు. నిర్వాసితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రిజర్వాయర్‌లో ముంపునకు గురి కానున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నామంటున్న సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలో నిర్వాసితులకు అతి తక్కువ పరిహారం ఇవ్వడం సరికాదన్నారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బలవంతంగా భూములను సేకరించడం సరికాదన్నారు. నిర్వాసితుల పక్షాన తమ పార్టీ చిత్తశుద్ధితో పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, గోపాల్, బాల్‌రాం, అంజిలయ్యగౌడ్, ఆంజనేయులు, గోవిందరాజు, జోషి, హన్మంతు, అంజి, అంజప్ప పాల్గొన్నారు.

రహదారి బురదమయం

» వరి నాట్లు వేసి బీజేపీ నాయకుల నిరసన


బొమ్మన్‌పాడ్, అమ్మిరెడ్డిపల్లి రోడ్డుపై వరి నాట్లు వేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మండలంలోని అమ్మిరెడ్డిపల్లి నుంచి బొమ్మన్‌పాడ్ వెళ్ళే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయం అయ్యింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి బురదమయం కావడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆర్ అండ్ బీ అధికారి రాములుకు ఫోన్ చేసి మాట్లాడారు. రోడ్డుకు వెంటనే మరమ్మతు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నప్పయాదవ్, ప్రవీణ్, రవి, రామకృష్ణ, భాస్కర్, పెంటప్ప, నర్సింహులు, సంతోష్, నవీన్, రాము, కిషోర్, శేఖర్, అరవింద్ పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్‌వో సస్పెన్షన్

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి లతను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆమెపై విధులకు సక్రమంగా రాకపో వడం, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకపోవడం, స్టాక్ రిజిస్టర్లను నిర్వహించకపోవడం తదితర ఆరోపణలున్నాయి. కేజీబీవీలో అక్రమాలపై గ్రా డ్యుయేట్స్ అసోసియేషన్ నాయకుడు ఎన్.భరత్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నోడల్ ఆఫీసర్ కుర్మయ్య విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదికను ఇచ్చారు. ఆమెను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటర్వ్యూ..

శాంతి భద్రతలను పరిరక్షిస్తాం

- శంషుద్దీన్, ఎస్ఐ, చారకొండ



చారకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యం అవుతుందని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసులతో చెప్పుకోవచ్చని ఎస్ఐ శంషుద్దీన్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

సైబర్ నేరాలపై ఎలా అప్రమత్తంగా ఉండాలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా ?

ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థతో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అదేవిధంగా వ్యక్తిగత బ్యాంకింగ్, ఆధార్‌కార్డు వివరాలు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దని సూచిస్తున్నాం.

రోడ్డు భద్రతలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

రోడ్డు భద్రతలపై ప్రతీరోజు సాయంత్రం ప్రధాన రహదారిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలని సూచిస్తున్నాం. తప్పని సరిగా వాహనదారులు వెంబడి వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలి. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిని గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం.

గ్రామాల్లో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా ?

నేరాల నియంత్రణలో మండలంలోని చారకొండ, మర్రిపల్లి, జూపల్లి, తిమ్మాయిపల్లి, జేపల్లి, సిరసనగండ్ల అయోధ్యనగర్ (గుట్ట) శేరిఅప్పారెడ్డిపల్లి గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొంటే నేరాలు చేయడం అవకాశాలు ఉండవు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి పరామర్శ

వంగూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డిండిచింతపల్లిలో శుక్రవారం యశోదమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి యశోదమ్మ మృతికి సంతాపం తెలిపి, వారి కుమారుడు ముత్యాల్‌రెడ్డిని పరామర్శించారు. నాయకులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి, ఉన్నారు.

అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి భూమి పూజ

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కొత్త అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్ర, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగేషు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఏపీవో వెంకటేష్, అంగన్‌వాడీ కేంద్రంటీచర్ ఖాజాబీ, పెద్దకొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దళితుడిని అవమానించిన వారిని శిక్షించాలి : కేవీపీఎస్

మన్ననూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు వేణుగోపాల స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణాష్టమి రోజున ఉట్లు కొట్టే కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌గా ఉన్న దళితుడైన శివాజీ గెలువయ్యను కొందరు వ్యక్తులు కులం పేరుతో దూషించి ఉట్లతాడు గుంజరాదని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు ముద్దు నూరి లక్ష్మీనారాయణ, మంతటి పర్వతాలు డిమాండ్ చేశారు. నిజనిర్ధారణలో భాగంగా మన్ననూరులో గెలువయ్యను శుక్రవారం కేవీపీఎస్ నాయకులు విచారించారు. యాదవులు తనను దూషించడంతో చాలా అవమానానికి గురయ్యానని బాధితుడు మొరపెట్టుకున్నారని తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

'సన్నాహక సభను జయప్రదం చేయండి'

కల్వకుర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 26న నిర్వహించే మందకృష్ణ మాదిగ హాజరయ్యే సన్నాహక సభను జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు తర్నికల్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచాలని మందకృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమానికి ప్రతీ ఒక్కరు మద్దతుగా నిలవాలని ఎమ్మార్పీఎస్ ఎమ్మార్పీ ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మద్దిలేటి, కల్వకుర్తి ఇన్‌చార్జ్ శేఖర్, రాజు కోరారు.

'షరతుల్లేకుండా యూరియా సరఫరా చేయాలి'

కందనూలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి షరతులు లేకుండా పంటకు సరిపడా యూరియా రైతులందరికీ సరఫరా చేయాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం దగ్గర శుక్రవారం మండలంలోని రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతుండడంతో బీఎంపీ ఆధ్వర్యంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, రామస్వామి, సైదులు, బాలగౌడ్, మండలంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలన

- బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



యంగంపల్లి తండాలో అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్సీ, కలెక్టర్

పెంట్లవెల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి మంచాల కట్ట వరకు ఎంఆర్‌ఆర్ నిధులు రూ.కోటీ 40 లక్షలతో బీటీ రోడ్ నిర్మాణానికి పెంట్లవెల్లిలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భూమి పూజ చేశారు. అదేవిధంగా యంగంపల్లి తండాలో రూ.8లక్షలతో అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ చేశారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహయాద్, కాంగ్రెస్ నాయకులు రామన్‌గౌడ్, గోవింద్‌గౌడ్, కబీర్, ఖాజా, ఖైనుద్దీన్, ఎర్ర శ్రీను, కోట్ల సురేందర్, గోపాల్, గోపినాయక్ పాల్గొన్నారు.

● మన్ననూర్ : శ్రీశైలం ప్రాజెక్టులో పర్యాటక భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వెళుతున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మన్ననూరు మృగవాణి రెస్టారెంట్ వద్ద శుక్రవారం సాయంత్రం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసులు, బాలమ్మ, కాంగ్రెస్ నాయకులు రహీం, సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, రాజారాం, అంబనారాయణ, సురేష్, తుల్స్యా, సైదులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో 270 బస్తాల యూరియా స్వాధీనం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అరుణోదయ ఫర్టిలైజర్ దుకాణంలోని 270 బస్తాల యూరియా, రికార్డులను మండల వ్యవసాయ అధికారి శిరీష శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమాని సుధాకర్ యూరియాను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు చర్య తీసుకున్నట్లు ఆమె తెలిపారు. పీవోఎస్ మిషన్‌లో దుకాణం యజమాని రైతుల వివరాలను నమోదు చేయకుండా అధిక ధరలకు విక్రయించారని, ఇలా 40బస్తాల యూరియాను విక్రయించారని ఆమె పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసుల సహాయంతో అరుణోదయ ఫర్టిలైజర్ షాపు గోదాంలో ఉన్న 270 యూరియా బస్తాలు ఉండగా గోదాంకు తాళం వేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సంఘటనపై ఇన్‌చార్జి ఏడీఏ చిన్న హుస్సేన్‌యాదవ్‌ను వివరణ కోరగా రేపు షాపును తనిఖీ చేసి అందుకు సంబంధించిన నివేదికను జిల్లా అధికారులకు పంపించి లైసెన్సు రద్దుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రతీ విద్యార్థికి కార్పొరేట్ విద్య

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సిద్దాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పేద విద్యార్థికి కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కన్యాతండాలో గ్రామంలోని దాతల సహకారంతో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామ సమీపంలోని గుర్రాలబండ దగ్గర నూతనంగా నిర్మించే ఆంజనేయస్వామి దేవాలయానికి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచితంగా విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మంత్రయ్య, మల్లేష్, ఉపాధ్యాయులు శంకర్, గోపాల్ పాల్గొన్నా రు.

● ఉప్పునుంతల : ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. దాసర్లపల్లిలో నూతన గ్రామపంచాయితీ భవనానికి, కంసానిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి, లత్తీపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి, గువ్వలోనిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంతనరెడ్డి, నర్సింహారెడ్డి, అనంతప్రతాప్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ జిల్లె జగత్‌రెడ్డి, రేణయ్య, భాస్కర్, శేఖర్, విజేందర్‌రెడ్డి ఉన్నారు.

పార్టీ కోసం ఐక్యంగా పని చేయాలి

- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



ఉప్పునుంతల : కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అచ్చంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అందరూ కలిసి కట్టుగా పార్టీ కోసం పనిచేసి స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలో పార్టీని గెలిపించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మండల ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తాను ఎల్లప్పుడూ అన్నలా తోడుగా ఉంటానని నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. రైతులకు యూరియా అందిచడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో రైతుసమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు మనోహర్, మాజీ మునిసిపల్ చైర్మన్లు నర్సింహ్మగౌడ్, తులసీరాం, నాయకులు పర్వతాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

ఉప్పునుంతల : నిఖార్సయిన కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ఓ ఫంక్షన్ హాల్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన గాలికి వదిలేసి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి విహార యాత్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోకల మనోహర్, మాజీ మునిసిపల్ చైర్మన్ నర్సింహ్మగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, నాయకులు గోపాల్‌రెడ్డి, బాలునాయక్, శోభన్ రెడ్డి, భాస్కర్, సంతోష్‌రెడ్డి, కృష్ణయ్య, బాలునాయక్, మల్లేష్, చిన్న జంగయ్య, ఎల్లయ్య యాదయ్ ఉన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

తాడూరు : మండలంలోని పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన ముడావత్ సత్యం కూతురు అనూష ఇంజనీరింగ్ విద్య కోసం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గుంతకోడూరు గ్రామంలో బీఆర్ఎస్ నాయకుని తండ్రి చనిపోవడంతో మర్రి ఆ గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. నాయకులు తిరుపతిరెడ్డి, బాల్‌రెడ్డి, రాజుగౌడ్, సమద్‌పాషా పాల్గొన్నారు.

రాత్రివేళ పకడ్బందీగా పెట్రోలింగ్ నిర్వహించాలి

- పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

అచ్చంపేటటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సైబర్ నేరాలు, దొంగతనాలతో పాటు కేసుల వివరాలను ఎస్ఐ విజయభాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. రిక్డాలను పరిశీలించారు. క్రైమ్ రేటు తగ్గే విధంగా చూడాలని తెలిపారు. రాత్రివేళల్లో పకడ్బందీగా పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, సీఐ నాగరాజు ఉన్నారు.

గణేశ్ నిర్వాహకులకు అవగాహన

అచ్చంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గణేశ్ ఉత్సవాల నిర్వాహకులకు ఎస్ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామరస్యంగా నిర్వహించుకోవాలి

తెలకపల్లి : వినాయక చవితి పర్వదినాన్ని సామరస్యంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ బి. నరేష్ అన్నారు. శుక్రవారం వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఏఈ శాంతంతేజ్, హెడ్ కానిస్టేబుల్ పరశురాములు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని భైరాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. డీఎల్ఐ కాలువలో భాగంగా రిజర్వాయర్ నిర్మాణానికి నిల్వఉంచిన ఇసుక డంపులను కొందరు అక్రమంగా తరలించారన్న విషయం తెలుసుకున్న ఆయన వచ్చి పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పుట్ట రాంరెడ్డి, వెంకటయ్యగౌడ్, నాయకులు నిరంజన్, కొండల్‌యాదవ్, ఆనంద్, జోగయ్య, రమేష్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చారకొండ : మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన మాడుగుల ముత్తయ్య, ఎర్ర లింగమ్మ, ఎలిమినేటి పద్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్యగౌడ్, అప్పల శేఖర్‌గౌడ్, కోళ్ల శ్రీను, గడ్డమీది రామస్వామి, చిలికేశ్వరం శ్రీను, ఎర్ర గెల్వయ్య, రామకృష్ణ, జమ్ముల వెంకటేష్, మల్లేష్, జమ్ముల శ్రీను, రఘువరన్, రవికుమార్, మహేష్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న వంతెనల మరమ్మతులు చేయిస్తాం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని శ్రీనివాస్ రావు



దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న రంగినేని శ్రీనివాస్

అచ్చంపేటటౌన్(లింగాల), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వంతెనలను త్వరలో మరమ్మతులు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ సమీపంలో దెబ్బతిన్న వంతెనలను ఆయన పరిశీలించారు. అప్పాయిపల్లి, ఎంసీతండా, శ్రీరంగాపురం గ్రామాలకు బస్సుసౌకర్యం నిలిచిపోయి, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ముక్తార్, వెంకటయ్య, శివ, రవీందర్, శ్రీశైలం, రాజల్‌యాదవ్, జనార్దన్, నిరంజన్ పాల్గొన్నారు.

బాధితుడికి తోటి ఫొటోగ్రాఫర్ల ఆర్థికసాయం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తెలకపల్లి మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే ఫొటోగ్రాఫర్ తలలో గడ్డ ఏర్పడడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అందుకుగాను రూ.5.82లక్షలు ఖర్చు అయింది. బాధితుడు మల్లేష్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని తన అత్తగారి ఊరైన పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న వివిధ ప్రాంతాల్లోని ఫొటోగ్రాఫర్లు సాతాపూర్‌కు వచ్చి బాధితుడి సతీమణి చందనకు రూ.51,800 నగదును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం లింగాల మండల అధ్యక్షుడు భాస్కర్, కోశాధికారి సుల్తాన్, యుగంధర్, కుర్మయ్య, గణేష్, శివ, శ్రీనివాసులు, జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుడు శ్రీమిత్ర రాజు పాల్గొని బాధితుడికి ఆర్థిక సాయం అందజేశారు.

సీపీఎస్ ఉద్యోగుల బ్లాక్‌డేను విజయవంతం చేయండి

కల్వకుర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శనివారం బ్లాక్‌డేగా నిర్వహిస్తున్నట్లు టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు తెలిపారు. జిల్లాలోని ప్రతీ సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకులు వారు పని చేస్తున్న పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని తెలిపారు. కల్వకుర్తిలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.


పాత పింఛన్ విధానం అమలు చేయాలి

తిమ్మాజిపేట : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు రమేష్ పవార్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో శుక్రవారం సీపీఎస్‌కు వ్యతిరేకంగా సెప్టెంబరు 1న నిర్వహించతలపెట్టిన మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఎంఈవో సత్యనారాయణ శెట్టి చేతుల మీదుగా విడుదల చేశారు. మహాధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సామ్సన్, అమరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, సత్య నారాయణ, రామకృష్ణారెడ్డి, యాదయ్య, పరంధాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రీన్ బోర్డుల పంపిణీ

తిమ్మాజిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాళ్లచెరువుతండాలో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కూచకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ బోర్డులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ గ్రామ నాయకుడు యాదయ్య మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలు, యువరాజు, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజు, పాఠశాల హెచ్ఎం సుధీర్, ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, రఘు, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో ఆర్టీసీ బస్సుకు ఘన స్వాగతం



ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలుకుతున్న పోతిరెడ్డిపల్లి గ్రామస్థులు

తిమ్మాజిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీబస్సు రావడంతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించారు. చాలా ఏళ్ల తర్వాత బస్సు రావడంతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో యువకులు ఆర్టీసీ బస్సుకు కొబ్బరికాయ కొట్టి పూల మాలలు కట్టి ఘన స్వాగతం పలికారు. ఆర్టీసీ కండక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డ్రైవర్ జితేందర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీ తిరుపతయ్య, జంగిరెడ్డి, కన్ని రాములు, హనుమంతు రెడ్డి, అశోక్, నిరంజన్, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

- ఎమ్మెల్యే కశిరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజారంజక పాలన కొనసాగుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో తన స్వగృహంలో పంపిణీ చేశారు. నియోజకవర్గంలోచౌదరపల్లికి చెందిన భగవాన్‌రెడ్డికి రూ.6లక్షల ఎల్‌వోసీ, ముర్తోజ్‌పల్లి సుభద్రమ్మకు రూ.51వేలు, ఎల్లికల్‌కు చెందిన మహేష్‌కు రూ.20వేలు, బాలమణికి రూ.36వేలు, తరికొండకు చెందిన లక్ష్మయ్యకు రూ.60వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తే చర్యలు

వెల్దండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : యూరియాను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఏవో మంజుల హెచ్చరించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఓ ఆగ్రో కేంద్రంనుండి అక్రమంగా యూరియాను తరలిస్తున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదుతో మంజుల ఆగ్రోకేంద్రాన్ని తనిఖీ చేశారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

వెల్దండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భైరాపూర్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక టిప్పర్లను గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గోకారం రిజర్వాయర్ నిర్మాణం కోసం తీసుకొచ్చిన ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

మురుగు కాల్వల పరిశీలన

కందనూలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దారి లేని సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు బురదలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి రామయ్య ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల ఆవరణ బురదమయంగా మారిందన్నారు. సురేష్, సుభాష్, శివ, సుధాకర్, మురళి, ప్రేమ్ ఉల్గొన్నారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న అసమర్థ పాలన

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్



అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

కల్వకుర్తి/ చారకొండ/ ఉప్పునుంతల/ తిమ్మాజిపేట/ కోడేరు/ అమ్రాబాద్/పెద్దకొత్తపల్లి/ వెల్దండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చౌకధర దుకాణాల డీలర్లు తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళనకు తరలివెళ్తుండగా పోలీసులు ఎక్క డికక్కడా అరెస్టు చేశారు. వీరి ఆందోళనకు మద్దతుగా వెళ్లే బీజేపీ నాయకులను సైతం పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లకు వారిని తరలించి, మధ్యాహ్నం తర్వాత సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. కల్వకుర్తిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు బోడ నరసింహ, కృష్ణ గౌడ్, రాఘవేందర్‌గౌడ్, నరేష్‌గౌడ్, శ్రీధర్, బలరాం, సురేందర్, చారకొండలో బీజేపీ మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ, నాయకులు కామోజీ శ్రీకాంత్, హరిబాబు, జటమోని శ్రీను, రవి నాయక్, పగడాల తిరుపతయ్య, ఉప్పునుంతలలో బీజేపీ నాయకులు మహేష్, రాజు, తిమ్మా జిపేటలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్య క్షుడు జుంపాల్, గుండా రామకృష్ణ, నరసింహ, మాధవులు, ప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, గోవిందు తదితర డీలర్లను, కోడేరులో డీలర్లు భక్తుల రాజు, పబ్బతి అశోక్, మేడిమాకుల శేఖర్, సొప్పరి రామకృష్ణ, బాలపీరు, కృష్ణయ్య, శివయ్య. అమ్రాబాద్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగారాజు, చంద్రయ్య గౌడ్, ఉప్పల పరమేష్, కృష్ణ యాదవ్, శంకర్‌గౌడ్, అజయ్, మల్లేష్ యాదవ్, వెల్దండలో బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు విష్ణుగౌడ్, శివప్రసాద్, యాదయ్య, సుదాకర్, అనిల్‌కుమార్, కుమార్ తదితరులను ఎక్కడికక్కడా పోలీసులు అరెస్టు చేశారు. పలువురు డీలర్లు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన కనీస గౌరవ వేతనం రూ.5వేలు, కమీషన్ 300 రూపాయలు ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో అసమర్థపాలన కొనసాగుతోందని కల్వకుర్తిలో అరెస్టయిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ అన్నారు. కోడేరులో బీజేపీ నాయకుడు రంగినేని రవీందర్‌రావు అరెస్టును తీవ్రంగా ఖండించారు.

ప్రతీ గ్రామంలో పనుల జాతర కొనసాగాలి

- ఎంపీడీవో ఆంజనేయులు



తాడూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనుల జాతర సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు

తాడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పనుల జాతర పనులన్నీ అన్నిగ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు జాతరకు సంబంధించి అంతర్గత రహదారుల అభివృద్ధి, మురికి కాల్వల నిర్వహణ, ఇంకుడు గుంతల నిర్మాణం, మొక్కలు నాటడం తదితర పనులన్నీ చేపట్టాలని సూచించారు. తాడూరు కేజీబీవీలో నూతనంగా ఏర్పాటు చేసే సోక్‌పిట్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎల్‌పీవో వరలక్ష్మి, ఏపీవో చంద్రసిద్దార్థ, ఎంపీవో నరసింహ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

● తిమ్మాజిపేటలో పనుల జాతరలో భాగంగా కృష్ణయ్య నిర్మించుకున్న పశువుల షెడ్డును ప్రత్యేక అధికారి రమేష్‌కుమార్ ప్రారంభించారు. అదేవిధంగా హనుమాన్ తండాలో పశువుల కొట్టం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏపీవో సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్రరావు, ఉపాధి సిబ్బంది లక్ష్మీ, బాలరాజు పాల్గొన్నారు.

● చారకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు శాలువాతో సన్మానించారు. ప్రత్యేక అధికారులు, ఎస్ఐ శంషుద్దీన్, ఏపీవో లక్ష్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్,కార్మికులు, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

● కోడేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. మండల కేంద్రంతో పాటు బావాయిపల్లి తదితర గ్రామాలలో పనులకు భూమి పూజ చేశారు. పారిశుధ్య కార్మికులను వాటర్‌మన్లను శాలువాతో సన్మానించారు.

● తెలకపల్లి మండలంలో పనుల జాతరకు సంబంధించిన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. మ్యాజిక్ సోక్‌పిట్స్, కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. గట్టురాయిపాకుల, చిన్న ముద్దునూరు గ్రామపంచాయతీ గ్రామసభలో ఎంపీడీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.